కుచించుకుపోతున్నా.. కన్నెత్తి చూడరా..?



పెదవాల్తేరు చేపల మార్కెట్ మీదుగా ప్రవహించే గెడ్డ పరిస్థితి

లాసన్స్ బే కాలనీ నంది గుడి సమీపంలో కుచించుకుపోయిన గెడ్డ



చిన్న కాలువగా మారిన అప్పుఘర్ మీదుగా లాసన్స్ బే కాలనీకి ప్రవహించే గెడ్డ



- గెడ్డల నిర్వహణను గాలికొదిలేసిన అధికారులు
- ఆక్రమణలతో కాలువల్లా మారుతున్న వైనం
- పెద్ద ఎత్తున్న పేరుకుపోయిన పూడికలు
- ఇబ్బంది పడుతున్న ఎంవీపీ కాలనీ వాసులు



17వ వార్డులో పూడికలతో నిండిన గెడ్డ

ఎంవీపీకాలనీ: జీవీఎంసీ 17, 18, 19 వార్డుల్లో గెడ్డల నిర్వహణ ఘోరంగా మారింది. నెలల తరబడి గెడ్డల్లో పూడిక తీయకపోవడంతో రోజురోజుకూ పరిస్థితి దిగజారుతోంది. ప్లాస్టిక్ బాటిళ్లు, చెత్తాచెదారం, అనేక రకాల వ్యర్థాలు కుప్పలుగా పేరుకుపోతున్నాయి. దీనికి తోడు పలు చోట్ల గెడ్డలు ఆక్రమణలకు గురై కుచించుకుపోతున్నా.. సంబంధిత అధికారులు కన్నెత్తి చూడటం లేదు. జీవీఎంసీ ఇంజినీరింగ్, పారిశుధ్య అధికారులు గెడ్డల్లో పూడిక తీతను, నిర్వహణను గాలికొదిలేయడంతో ఈ పరిస్థితి తలెత్తిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. వ్యర్థాల నుంచి వెలువడుతున్న దుర్గంధం భరించలేక పోతున్నామని వాపోతున్నారు.

కానరాని పూడిక తీత..

ఎంవీపీ కాలనీలోని అనేక ప్రాంతాల్లో ప్రవహిస్తున్న గెడ్డలు నిర్వహణ లేమితో కుచించుకుపోతున్నాయి. అడపాదడపా జరుగుతున్న ఆక్రమణల కారణంగా విశాలంగా ఉండాల్సినవి కాస్తా కాలువల్లా మారుతున్నాయి. జీవీఎంసీ 17వ వార్డు పెదవాల్తేరు చేపల మార్కెట్ మీదుగా లాసన్స్ బే కాలనీ వైపు ప్రవహించే గెడ్డ పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. దీనిలో పెద్ద ఎత్తున పూడికలు పేరుకుపోవడంతోపాటు చేపల మార్కెట్, టీకు పార్క్ పరిసరాల్లో కుచించుకుపోయింది. దీని నిర్వహణను, శుభ్రతను జీవీఎంసీ అధికారులు, సిబ్బంది ఎవరూ పట్టించుకోక పోవడంతో చిన్న కాలువలా మారిపోతోంది. గతంలో పొక్లెయిన్ సాయంతో పారిశుధ్య సిబ్బంది గెడ్డల్లో పూడిక తీయడంతోపాటు ఆక్రమణలను తొలగించే వారు. గత రెండేళ్లుగా ఈ ప్రక్రియ నిలిచిపోవడంతో పరిస్థితి అధ్వానంగా తయారైంది.

భరించలేని దుర్వాసన..

ఎంవీపీ సెక్టార్–12 లాసన్స్ బే కాలనీలోని నంది గుడి ప్రాంతంలో ప్రవహిస్తున్న గెడ్డ పరిస్థితి దారుణంగా ఉంది. 18వ వార్డు అప్పుఘర్, ఎంవీపీ సెక్టార్–10ల మీదుగా లాసన్స్ బే కాలనీ వైపు ప్రవహించే గెడ్డ సైతం కుచించుకుపోవడంతోపాటు వ్యర్థాలతో అధ్వానంగా దర్శనమిస్తోంది. గతంలో విశాలంగా ఉండే ఈ గెడ్డ ఆక్రమణల కారణంగా కాలువలా మారిందని స్థానికులు చెబుతున్నారు. ఆయా ప్రాంతాల్లోని గెడ్డల్లో పేరుకుపోయిన వ్యర్థాల నుంచి వస్తున్న దుర్వాసనను భరించలేక పోతున్నామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జీవీఎంసీ ఇంజినీరింగ్, పారిశుధ్య విభాగం అధికారులు స్పందించి గెడ్డల పరిస్థితిని చక్కదిద్దాలని స్థానికులు కోరుతున్నారు.

క్లుప్తంగా

కరకచెట్టు పోలమాంబ జాతరకు ఆహ్వానం

బీచ్‌రోడ్డు: పెదవాల్తేరులోని కరకచెట్టు పోలమాంబ అమ్మవారి జాతర మహోత్సవాలకు 20వ వార్డు కార్పొరేటర్ మువ్వల లక్ష్మి, వైఎస్సార్‌సీపీ విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి మువ్వల సురేష్‌లను ఆలయ ఈవో గాయత్రి ఆహ్వానించారు. గురువారం వారి ఇంటికి ఆమె వెళ్లి ప్రత్యేక అతిథిగా పూజలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని, సేవలో పాలుపంచుకోవాలని కోరారు. ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు పాల్గొన్నారు.

ఇద్దరు చైన్ స్నాచర్లపై కేసు

ఎంవీపీకాలనీ: శివాజీపాలేనికి చెందిన గుగిలపు శోభారాణి అనే మహిళ మెడలో చైన్ దొంగతనానికి పాల్పడిన ఇద్దరు చైన్ స్నాచర్లపై ఎంవీపీ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలిలా.. శివాజీపాలెం సాయిబాబ ఆలయ సమీపంలో గుగిలపు శోభారాణి కుటుంబ సభ్యులతో కలిసి నివసిస్తున్నారు. ఈ నెల 10వ తేదీ గురువారం మధ్యాహ్నం ఆమె ఇంట్లో పనిచేసుకుంటుండగా.. గుర్తు తెలియని వ్యక్తి శోభారాణి వద్దకు వచ్చి విష్ణు అపార్ట్‌మెంట్ ఎక్కడుందంటూ హిందీలో అడ్రస్ అడిగాడు. ఆమె ముందుకు వెళ్లి చూడాలని అతడికి తెలిపింది. అనంతరం అతడు మంచినీరు కావాలని అడగ్గా.. ఆమె బయటకు వచ్చి కాంపౌండ్ వాల్ దగ్గర ఉన్న కుళాయిని చూపించింది. ఈ క్రమంలో ఆ వ్యక్తి హఠాత్తుగా శోభారాణి మెడలో ఉన్న నాలుగు తులాల బంగారం గొలుసు లాక్కుని అక్కడే రోడ్డుపై వేచి చూస్తున్న మరో వ్యక్తితో కలిసి పరారయ్యాడు. వారిని పట్టుకోవాలని ఆమె ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. ఈ ఘటనపై శోభారాణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎంవీపీ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పౌర గ్రంథాలయ సేవలకు ప్రశంసలు



గ్రంథాలయంలో పుస్తకాల నిర్వహణను పరిశీలిస్తున్న కృష్ణమోహన్

సీతంపేట: పౌర గ్రంథాలయాన్ని గురువారం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ గ్రంథాలయ సంచాలకులు ఎ.కృష్ణమోహన్ సందర్శించారు. గ్రంథాలయ పాలకవర్గ కార్యదర్శి డి.ఎస్.వర్మ వివిధ విభాగాలను చూపించి, గ్రంథాలయ ప్రగతిని, పటిష్ట నిర్వహణకు నెలకొల్పిన విధానాలు, సిబ్బంది అంకితభావం గురించి వివరించారు. సంచాలకులు కృష్ణమోహన్ మాట్లాడుతూ గ్రంథాలయంలోని సదుపాయాలు, పోటీ పరీక్షల విద్యార్థులకు కల్పించిన ఆహ్లాదకరమైన వాతావరణం, పరిసరాల నిర్వహణ అద్భుతంగా ఉందని ప్రశంసించారు. విద్యార్థులు, మహిళలు, కళాకారులు, సాహితీవేత్తలు, యువత ఇలా అన్ని వర్గాల వారి అవసరాలకు తగినట్టు గ్రంథాలయాన్ని తీర్చిదిద్దారని పాలకవర్గాన్ని అభినందించారు. దాతల విరాళాలను సక్రమంగా వినియోగిస్తూ గ్రంథాలయాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తుండటం స్ఫూర్తిదాయకమని కొనియాడారు. కార్యక్రమంలో సహ కార్యదర్శి డి.వి.సూర్యారావు, గ్రంథ పాలకురాలు దుర్గారాణి తదితరులు పాల్గొన్నారు.

పిల్లలకు సత్వర వైద్య సేవలందించండి



పిల్లల తనిఖీ గదిలో వైద్య సేవలను పరిశీలిస్తున్న గొండు సీతారామ్

సీతంపేట: కంటి చూపు సమస్యలతో ఆస్పత్రికి వచ్చే పిల్లలకు సత్వర వైద్య సేవలందించాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారామ్ సూచించారు. బుల్లయ్య కళాశాల రోడ్డులోని ప్రభుత్వ ప్రాంతీయ నేత్ర వైద్యశాలను గురువారం ఆయన సందర్శించారు. కమిషన్ ఆదేశాలలో జనవరిలో కంటి ఆస్పత్రిలో పిల్లల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఓపీ, తనిఖీ గది, శస్త్ర చికిత్సల వార్డులను సూపరింటెండెంట్ డాక్టర్ వి.మీనాక్షి, ఇన్‌చార్జి ఆర్‌ఎంవో వాసుపల్లి శ్రీలక్ష్మితో కలిసి పరిశీలించారు. రోజూ పిల్లల ఓపీ ఎంత వస్తోంది, వారికి క్యూలైన్‌తో సంబంధం లేకుండా వైద్య సేవలు అందిస్తున్నారా తదితర విషయాలను పిల్లలను, వారి తల్లిదండ్రులను అడిగి తెలుసుకున్నారు. చికిత్స కోసం వచ్చే పిల్లలకు ప్రత్యేక ఓపీ, ప్రత్యేక తనిఖీ గదిలో సేవలందించి త్వరితగతిన పంపించే ఏర్పాట్లు పూర్తి స్థాయిలో అందేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ప్రత్యేక ఓపీ, చికిత్స సేవలపై అందరికీ తెలిసేలా చర్యలు తీసుకుంటామని సూపరింటెండెంట్ డాక్టర్ వి.మీనాక్షి తెలిపారు.

ఎలక్ట్రిక్ బస్సులను ఆర్టీసీ ఉద్యోగులతో నడపాలి



వాల్తేరు డిపో వద్ద ధర్నా చేస్తున్న ఎన్ఎంయూఏ నాయకులు, ఆర్టీసీ ఉద్యోగులు

ఆరిలోవ: త్వరలో కొనబోయే ఎలక్ట్రిక్ బస్సులను ఆర్టీసీ ఉద్యోగులతో నడిపించాలని ఎన్ఎంయూఏ కమిటీ రాష్ట్ర కోశాధికారి పి.వి.వి.మోహన్ డిమాండ్ చేశారు. ఎన్ఎంయూఏ ఆధ్వర్యంలో గురువారం వాల్తేరు డిపో వద్ద ఉద్యోగులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1/2019 సర్క్యులర్ అమలు చేయాలన్నారు. ఉద్యోగులకు ఈహెచ్ఎస్ ద్వారా కాకుండా పాత విధానం ద్వారా వైద్య సదుపాయం కల్పించాలని, నైట్ అవుట్ అలవెన్స్ రూ.150 నుంచి రూ.400కు పెంచాలని, మహిళా ఉద్యోగులకు చైల్డ్ కేర్ లీవ్ ఏర్పాటు చేయాలని కోరారు. అక్రమ సెస్పెన్షన్లు ఆపి, గ్యారేజీ ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. అవుట్ సోర్సింగ్ సిబ్బందికి సంస్థ ద్వారా జీతాలు ఇవ్వాలన్నారు. అనంతరం డిపో ఎండీకి డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో డిపో చైర్మన్ బి.రవి, అధ్యక్షుడు పి.జి.పతి, డిపో కార్యదర్శి ఆర్.వసంతరావు తదితరులు పాల్గొన్నారు.

ఏయూ కాంట్రాక్టు ఆచార్యుల్లో ఆందోళన



ఎమ్మెల్సీ చిరంజీవిరావుకు వినతిపత్రం అందజేస్తున్న ఏయూ కాంట్రాక్టు ఆచార్యులు

విశాఖ విద్య: ఆంధ్రా యూనివర్సిటీలో కాంట్రాక్టు ప్రాతిపదికన పనిచేస్తున్న ఆచార్యుల్లో ఆందోళన మొదలైంది. నాగార్జున యూనివర్సిటీలో 60 ఏళ్లు నిండిన వారిని తొలగించడంతో.. త్వరలోనే తమను కూడా ఇంటికి పంపించేసేలా ఉన్నత విద్యా మండలి అధికారులు తీసుకుంటున్న నిర్ణయం సరైంది కాదని నిరసన గళమెత్తారు. ఆంధ్రప్రదేశ్ ఫెడరేషన్ ఆఫ్ యూనివర్సిటీ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కె.అర్జునుడు నేతృత్వంలో ఏయూ కాంట్రాక్టు ఆచార్యులందరూ గురువారం పట్టభద్రుల ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావును కలిసి వినతిపత్రం అందించారు. కూటమి ప్రభుత్వంలో తమకు జరుగుతున్న అన్యాయాన్ని వివరించారు. 60 ఏళ్లు నిండిన వారిని ఉద్యోగ విరమణ చేయాలని చెబుతుండటంతో తామంతా తీవ్ర ఆందోళన చెందుతున్నామన్నారు. ప్రభుత్వం నుంచి తమకు స్పష్టత ఇవ్వాలని, లేకుంటే రాష్ట్ర వ్యాప్తంగా పనిచేస్తున్న 3 వేల మంది ఆచార్యులమంతా కుటుంబాలతో ఉన్నత విద్యా మండలి కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. దీనిపై ఉన్నత విద్యా మండలి అధికారులు, విద్యా శాఖ మంత్రితో చర్చించి, న్యాయం చేస్తామని ఎమ్మెల్సీ చిరంజీవిరావు హామీ ఇచ్చినట్లుగా డాక్టర్ అర్జునుడు తెలిపారు. కాంట్రాక్టు ఆచార్యుల నాయకులు డాక్టర్ హరీష్, ఎం.ఎ.జెడ్.అలీ, ప్రకాష్, రత్నం రాజు, పుష్ప రాజ్యం, ఎం.వి.వి.ఎస్.ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ఫిషింగ్ హార్బర్‌ను సందర్శించిన విద్యార్థులు



మత్స్య శాఖ కార్యాలయం వద్ద విద్యార్థులు

మహారాణిపేట: రాష్ట్ర మత్స్య సాంకేతిక సంస్థ (కాకినాడ)లో శిక్షణ పొందుతున్న విద్యార్థులు గురువారం విశాఖ ఫిషింగ్ హార్బర్‌ను సందర్శించారు. మూడు రోజులుగా విద్యార్థులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ మత్స్య సంస్థలు, ఇతర కార్యాలయాలను సందర్శించి అక్కడ నిర్వహిస్తున్న కార్యక్రమాల గురించి తెలుసుకున్నారు. పలు అంశాలపై అధ్యయనం చేశారు. ఈ సందర్భంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టిన పలు సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల గురించి మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్ పి.లక్ష్మణరావు విద్యార్థులకు వివరించారు. రాష్ట్ర మత్స్య సాంకేతిక సంస్థ అడిషనల్ డైరెక్టర్ ఎ.చంద్రశేఖర్ రెడ్డి వివిధ పథకాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. మత్స్యశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ విజయకృష్ణ, సిబ్బంది లక్ష్మణరావు పాల్గొన్నారు.

భద్రం.. బ్రదర్..!







ఎండలు మండుతుండటంతో మంచినీటికి డిమాండ్ ఏర్పడింది. దీంతో వాటర్ బాటిల్ కొనుగోళ్లు జోరుగా సాగుతున్నాయి. అదే సమయంలో ఓవర్ లోడ్‌తో ప్రయాణించడం అత్యంత ప్రమాదకరం. నగరంలో పలువురు ద్విచక్ర వాహనంపై అధిక సంఖ్యలో వాటర్ బాటిళ్లు, వివిధ సామగ్రి పట్టుకెళ్లారు. ఆటోల్లో పరిమితికి మించి వివిధ రకాల సామగ్రి, పండ్లను బుట్టల్లో పెట్టి తీసుకెళ్లారు. ఇలా ఓవర్ లోడ్‌తో వాహనాలపై వెళ్లేటప్పుడు జాగ్రత్తగా లేకుంటే కుటుంబాలకు తీరని శోకమే మిగులుతుంది.

– ఫొటోలు: సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్ల కోసం ఉద్యమిద్దాం

సీతంపేట: ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్ల కోసం ఉద్యమించాలని అంబేడ్కర్ మెమోరియల్ సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు బొడ్డు కల్యాణరావు, జె.వి.ప్రభాకర్ పిలుపునిచ్చారు. స్థానిక అంబేడ్కర్ భవన్‌లో గురువారం జరిగిన మీడియా సమావేశంలో నూతనంగా ఎన్నికైన సొసైటీ కమిటీని పరిచయం చేసి, అంబేడ్కర్ జయంతి ఉత్సవాల కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమానత్వం, స్వేచ్ఛ కోసం నిర్మితమైన రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్‌లు తమ సొంత రాజ్యాంగాన్ని అమలు చేస్తూ భారత రాజ్యాంగాన్ని నిర్వీర్యం చేస్తున్నాయని ఆరోపించారు. ప్రభుత్వ రంగ సంస్థలన్నింటిని విక్రయిస్తూ ఎస్సీ, ఎస్టీలకు ఉపాధి లేకుండా రిజర్వేషన్లకు దూరం చేసే పన్నాగం పన్నుతున్నారని మండిపడ్డారు. ప్రైవేట్ రంగంలో కూడా రిజర్వేషన్లు కల్పించే బిల్లును ప్రవేశపెట్టాలని ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామన్నారు. ఈ నెల 14న సొసైటీ ఆధ్వర్యంలో బి.ఆర్.అంబేడ్కర్ 134వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహిస్తామని తెలిపారు.

విప్లవోద్యమాల చైతన్య దీప్తి 'కానూరి'

సీతంపేట: కళాకారుడు ప్రజాపక్షం వహించాలనే నిబద్ధత కామ్రేడ్ కానూరి గళంలో కనిపిస్తుందని కవి సిరికి స్వామినాయుడు అన్నారు. ప్రజా కవి కామ్రేడ్ కానూరి వెంకటేశ్వరరావు పదో వర్ధంతి సభ అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య ఆధ్వర్యంలో గురువారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో జరిగింది. ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడుతూ సాంస్కృతికోద్యమ నేత, విప్లవోద్యమాల చైతన్య దీప్తి కానూరి అని కొనియాడారు. ప్రజాకళలకు పురుడు పోసి అరుణోదయాన్ని భావితరాలకు అందించిన ఆయన స్ఫూర్తిగా నిలిచారన్నారు. ఒక తరం అనుభవాలను మరో తరానికి అందించడానికి కానూరి వర్ధంతి సభ నిర్వహించడం అభినందనీయమన్నారు. అరుణోదయ సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నన్నూరెట్టి రాజశేఖర్ మాట్లాడుతూ కేంద్రంలోని ఆర్ఎస్ఎస్, బీజేపీ ప్రభుత్వం భారత రాజ్యాంగ మూలాలపై దాడి చేస్తూ ఒకే దేశం, ఒకే చట్టం పేరుతో వివిధ జాతులు, మతాల ఆచార, సంప్రదాయాలను నాశనం చేస్తోందని ఆరోపించారు. జాతీయ భాష పేరుతో ప్రాంతీయ భాషల అస్తిత్వాన్ని ప్రశ్నార్థకంగా మార్చుతున్నారని మండిపడ్డారు. ప్రజాకవి కానూరి పట్టుదల, నిబద్ధత అలవర్చుకుని కళాకారులు ప్రజల పక్షాన ఉద్యమించాలని పిలుపునిచ్చారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

ఆరిలోవ: విమ్స్‌కు చెందిన 33/11 కేవీ సబ్ స్టేషన్ పరిధిలోని రెవెన్యూ కాలనీ, కైలాసగిరి ఫీడర్లలో మరమ్మతుల నిమిత్తం శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని జోన్–3 ఈఈ పోలాకి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విశాలాక్షినగర్, రెవెన్యూ కాలనీ, కైలాసగిరి రోడ్డు, షిర్డీసాయి వెటర్నరీ కాలనీ, చలపతి నగర్, సంజీవినగర్, హనుమంతవాక కొండవాలు, బీఎస్ఆర్ నగర్, తోటగరువు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించాలని కోరారు.

ట్రాఫిక్ నిబంధనలపై విద్యార్థుల ప్రదర్శన



మద్దిలపాలెం కూడలిలో ప్లకార్డులు ప్రదర్శిస్తున్న విద్యార్థులు

మద్దిలపాలెం: ట్రాఫిక్ నిబంధనలు విధిగా పాటించి సురక్షిత ప్రయాణానికి మార్గం సుగమం చేసుకోవాలంటూ ఓ ప్రైవేట్ కళాశాల విద్యార్థులు గురువారం మద్దిలపాలెం కూడలిలో ప్రదర్శన చేపట్టారు. ట్రాఫిక్ ఎస్ఐ కనకరాజు పాల్గొని ట్రాఫిక్ నియమ నిబంధనల గురించి విద్యార్థులకు వివరించారు. వాహన చోదకులు విధిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. హెల్మెట్ ధరించి వాహనాలు నడుతున్న వారికి విద్యార్థులు పువ్వులు ఇచ్చి కరచాలనం చేశారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సిబ్బంది బొత్స నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు విధిగా పాటించాలి

సీతమ్మధార: విద్యార్థి దశ నుంచే ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన పెంచుకోవాలని ఫోర్త్ టౌన్ ఈస్ట్ ట్రాఫిక్ సీఐ అమ్మి నాయుడు అన్నారు. సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు పెస్ స్కూల్ సౌజన్యంతో గురువారం అక్కయ్యపాలెం జాతీయ రహదారి వద్ద విద్యార్థులతో కలిసి వాహన చోదకులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు.

ప్రధాన కాలువను పరిశీలించిన అధికారులు



ఇసుకతోట పెట్రోల్ బంక్ వద్ద ప్రధాన కాలువలో పొక్లెయిన్‌తో పూడిక తొలగిస్తున్న సిబ్బంది



మురుగు నీటి తొలగింపు పనులను పరిశీలిస్తున్న జీవీఎంసీ అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

మద్దిలపాలెం: ఇసుకతోట కూడలి సమీపంలోని ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్ వద్ద ప్రధాన కాలువ మంగళవారం రాత్రి ముంచెత్తిన వర్షానికి ముంపునకు గురైన విషయం తెలిసిందే. కాలువలో పేరుకుపోయిన పూడికలను తొలగించకపోవడమే ఈ సమస్యకు ప్రధాన కారణమంటూ 'ముంపు ముప్పు' అనే శీర్షికన గురువారం 'సాక్షి'లో ప్రచురించిన కథనానికి జీవీఎంసీ అధికారులు స్పందించారు. గురువారం ఉదయం జీవీఎంసీ సూపరింటెండెంట్ ఆఫ్ ఇంజినీరింగ్(ఎస్ఈ) సత్యనారాయణ రాజు, ఈఈ, డీఈల బృందం, జోన్–3 కమిషనర్ శివప్రసాద్ ఈ ప్రాంతాన్ని సందర్శించి, ప్రధాన కాలువను పరిశీలించారు. ఇక్కడ నిబంధనలకు విరుద్ధంగా పెద్ద కాలువను భూగర్భ డ్రైనేజీకి అనుసంధానం చేసిన విధానాన్ని చూసి వారంతా అవాక్కయ్యారు. పెట్రోల్ బంక్ మార్గానికి వేసిన పైపులను తవ్వి తీసి వాటిలో చెత్త తొలగించాల్సి ఉండటంపై అధికారులు మల్లగుల్లాలవుతున్నారు. కాలువ ప్రాంతం జీవీఎంసీ పరిధిలో ఉండగా.. దీనికి ఆనుకుని ఆర్అండ్‌బీ శాఖ రోడ్డుంది. దీని మధ్యలో పెట్రోల్ బంక్‌కు వెళ్లే మార్గం ఉంది. దాని కింద ఉన్న డ్రైనేజీ గొట్టాలు చెత్తతో నిండిపోయాయి. వాటిని తీయాలంటే అటు ఆర్అండ్‌బీ శాఖ.. ఇటు పెట్రోల్ బంక్ యాజమాన్యం అనుమతి తీసుకోవాలంటూ అధికారులు ఒకరిపై ఒకరూ ఎలా చేద్దామనే దానిపై ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ చర్చలతో గడిపారు. చివరికి పొక్లెయిన్‌తో ప్రధాన కాలువలోని కాస్త చెత్తను మాత్రం తొలగించారు. ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపకుండా అక్కడి నుంచి జీవీఎంసీ అధికారులు వెళ్లిపోయారంటూ స్థానికులు విమర్శిస్తున్నారు.

పబ్లిక్ పార్క్ ప్రారంభమెప్పుడో?



9వ వార్డు జోడుగుళ్లపాలెంలో జీవీఎంసీ నిర్మించిన పబ్లిక్ పార్క్

ఆరిలోవ: జీవీఎంసీ జోన్–2 పరిధి 9వ వార్డు జోడుగుళ్లపాలెంలో బీచ్ రోడ్డు పక్కన నిర్మించిన పబ్లిక్ పార్క్ ప్రారంభానికి నోచుకోలేదు. జీవీఎంసీ గతేడాది ఈ పార్క్ నిర్మాణం చేపట్టింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో సుమారు రూ.60 లక్షలతో చేపట్టిన ఈ పార్కు పనులు ఎనిమిది నెలల కిందట పూర్తయ్యాయి. ఇందులో పిల్లల ఆట పరికరాలు, పెద్దలు సేదదీరడానికి షెల్టర్ తదితర సౌకర్యాలు ఏర్పాటు చేశారు. ప్రజా ధనం ఖర్చుచేసి నిర్మించిన ఈ పార్కును అధికారులు నేటికీ ప్రారంభించకుండా వృథాగా వదిలేశారు. దీనిని ఎప్పుడు ప్రారంభిస్తారోనని స్థానికులు ఎదురు చూస్తున్నారు.

● ఒకరిది వినోదం.. మరొకరిది భుక్తి



జీవితం అందరికీ వడ్డించిన విస్తరి కాదు. ఒక్కో వ్యక్తికి జీవితం ఒక్కో రకంగా ఉంటుంది. అందరికీ అనేక పాఠాలు నేర్పిస్తుంది. ఈ ప్రయాణంలో మన చుట్టూ ఉన్న సమాజాన్ని, అనేక మంది వ్యక్తులను చూస్తుంటే మనకు ఇది అర్థమవుతుంది. ఇటువంటి దృశ్యమే సాగర తీరంలో కనిపించింది. ఇద్దరు చిన్నారులు గుర్రంపై కూర్చుని సవారీ చేస్తున్నారు. అదే సమయంలో ఆ గుర్రాన్ని కళ్లెం పట్టుకుని మరో చిన్నారి నడిపిస్తున్నాడు. గుర్రాన్ని నడిపిస్తున్న బాలుడు, అశ్వంపై స్వారీ చేస్తున్న బాలలు దాదాపుగా ఒకే వయసు గల వారు. ఒకరికి ఇది వినోదాన్ని ఇస్తుంటే.. మరొకరు భుక్తిని వెతుక్కుంటున్నారు.

– ఏయూక్యాంపస్